# జెలసీ

కాంతామతీ, శ్యామలరావూ కలిసి తిరగటం చూసేటప్పటికి బ్రహ్మానందానికి ఆశ్చర్యం వేసింది. పైగా వాళ్ళిద్దరూ తనని చూచి నవ్వుకుంటూ వెళ్ళారు. ఒక్క బ్రహ్మానందానికే కాదు, వాళ్ళిద్దరి సంగతీ తెలిసిన ఎవరికైనా ఆశ్చర్యం వేసేదే. మానవ మనస్తత్వం పూర్తిగా తెలుసు అనుకునే బ్రహ్మానందానికి ఆశ్చర్యం కలగటమే కాకుండా, తన తెలివితేటల మీద తనకే నమ్మకంపోయింది.

అతను మరి ఏ ఇద్దరు కలిసితిరిగినా అంత చకితుడయ్యేవాడు కాదు. అతను స్త్రీ పురుషు లిద్దరు కలిసి తిరగకూడదనే భావం కలవాడు కాదు. కలసి తిరిగితే వెర్రి వెర్రి చూపులు చూచే స్వభావం కలవాడు కూడా కాదు. స్వభావసిద్ధమైన వ్యవహారంగానే పరిగణించేవాడు.

అటువంటివాడు కాంతామతీ, శ్యామలరావూ కలిసి తిరగటం చూసేటప్పటికి చకితుడయ్యాడంటే దానికి ప్రబలమైన కారణం వుండితీరాలి. ఆ కారణం ఇది:

శ్యామలరావు చుట్టపు చూపుగా బ్రహ్మానందం ఇంటికి వచ్చాడు. అతనికి ఆ ఊళ్ళో కొద్దిగా పని వుందనీ, అయిదారు రోజులుండి పోతాననీ చెపితే, "మా యింట్లోనూ ఎవరూ లేరు. ఒక్కడినే వుంటున్నాను" అని తన యింటికి ఆహ్వానించాడు బ్రహ్మానందం. అప్పటినుంచీ తన యింట్లోనే వుంటున్నాడు శ్యామలరావు. రోజులు గడిచిపోతున్నాయి గాని అతను వెళ్ళలేదు. బ్రహ్మానందం కూడా తన పనుల మీద తాను వుండి ఆ విషయానికి ప్రాధాన్యం ఇవ్వలేదు.

ఆ రోజు శ్యామలరావు ఇంట్లో లేనప్పుడు తాను స్నానం చేస్తు వుండగా కాంతామతి వచ్చింది.

కాంతామతి చాలా కాలంనుంచీ పక్క యింట్లోనే వుంటున్నప్పటికీ తనకు పరిచయం లేదు. ఎన్నడూ పలకరించుకుని ఎరగరు. తన భార్యకే మన్నా పరిచయం వుండేమో అతనికి తెలియదు. అటువంటి ఆమె, తన భార్య ఇంట్లో లేదని తెలిసికూడా తాను ఒంటరిగా వున్నప్పుడు రావటం విచిత్రంగా వుంది బ్రహ్మానందానికి.

ఆమె తలుపు చాటున నిలబడి, "మీతో వుంటూ వున్నది మీ బంధువాండీ?" అని అడిగింది.

ఆమె శ్యామలరావును గురించి అడుగుతూవుందని గ్రహించి, "బంధువుకాదు, స్నేహితుడు" అన్నాడు బ్రహ్మానందం.

"ఎవరైతే ఏమండీ, ప్రవర్తన మంచిది కానప్పుడు...." అన్నది కాంతామతి.

ఏదో కొంపమీదికి తేనేతెచ్చాడని భయపడ్డాడు బ్రహ్మానందం. శ్యామలరావుసంగతి అతనికి తెలుసు. కన్నుగీటే స్వభావంవుంది. కాంతామతితో ఏదో అసభ్యంగా ప్రవర్తించి వుంటాడని కంగారుపడుతూ, "ఏమండీ, అతను మంచివాడేనే? ఏం చేశాదేమిటి?" అని అడిగాడు నీళ్ళు పోసుకోటానికి పైకి ఎత్తిన చెంబు ఆపి.

"ఏం చెయ్యట మేమిటండీ? చుట్టుపక్కల అంతాగోలగావుంటేనూ? రోజు కొక అమ్మాయిని తీసుకువొస్తున్నాడు. పోనీ తీసుకువస్తే తీసుకు వొచ్చాడు తలుపువేసుకో కూడదుటండీ! తలుపులు బార్లాతీసి....అయ్యోయ్యో, ఇంత విడ్డూరమైతే ఎట్లా చెప్పండి? మాంసం తింటామని బొమికలు మెడకు కట్టుకు తిరుగుతామా? పోనీ, మొగవాడు ఆయనకు లేకపోతే, ఆడది గదా తనకైనా వుండకూడదూ? ఎవరైతే మాత్రం అంత విడిచేసుకు తిరిగితే ఎట్లా? అందులో పదిమంది కాపురాలున్న చోటు; పెళ్ళి కావలసిన పిల్లలున్నారు...." అంటూ మొదలు పెట్టింది.

బ్రహ్మానందానికి నిజంగా ఒళ్ళుమండింది ఈ మాటలు వింటూ వుంటే. తన భార్య వచ్చిన తరువాత యీ సంగతి ఆమెకు తెలిస్తే? ఆమె

యేమనుకుంటుంది? తనకేమీ తెలియదని చెపితే మాత్రం నమ్ముతుందా? స్నేహితు లిద్దరూ కలిసే చేశారు అనుకోదూ!

కోపం దిగమింగి, "నేను కనుక్కుంటాను లెండి" అన్నాడు ఆమెను పంపించి వెయ్యాలనే వుద్దేశంతో.

"కొంచెం మందలించండి. మనం ఇన్నాళ్ళనుంచీ ఏ పొరుపులూ లేకుండా వుంటున్నాం. ఇట్లా అయితే యిక మే మిక్కడ కాపురాలు చెయ్యలేం. చెడకైనా హద్దూపద్దూ వుండొద్దుటండీ" అంటూ వెళ్ళిపోయింది కాంతామణి.

ఆ రాత్రే శ్యామలరావుని బ్రహ్మానందం చీవాట్లు వేశాడు. కాని ఎంత అడిగినా వొప్పుకున్నాడు కాదు.

"అంతా వొట్టిదోయ్. నాకోసం వొక అమ్మాయి వొస్తూవున్నమాట నిజమే. ఆ అమ్మాయి ఇక్కడ బి. ఏ. చదువుతూంది. వాళ్ళది మా వూరే. ఆ అమ్మాయిని నేను చిన్నప్పటినుంచీ ఎరుగుదును. నేను వచ్చేటప్పుడు ఆ అమ్మాయి తండ్రి తన కూతుర్ని చూచి రమ్మని మరీ మరీ చెప్పాడు. అంతకంటే యేమీ లేదు" అన్నాడు శ్యామలరావు.

"అయితే కాంతామణి చెప్పేదంతా అబద్ధమంటావా" అని అడిగాడు బ్రహ్మానందం.

"అబద్ధమే" అన్నాడు శ్యామలరావు.

"నీమీద కల్పించి చెప్పటానికి ఆమె కేమి అవసరం వుంది!" అని అడిగాడు బ్రహ్మానందం.

"పూర్తిగా అవసరం లేదని చెప్పటానికి వీల్లేదు" అన్నాడు శ్యామలరావు ఆలోచిస్తూ.

తరువాత యీ విషయం మళ్ళీ బ్రహ్మానందం మరిచిపోయాడు. శ్యామలరావు అతని గదిలోనే వుంటూ వున్నా, అతని ప్రవర్తనని గురించి

పితూరీలేమీ లేవు. కాంతామతి ఒకటి రెండుసార్లు తనకి కనుపించి సిగ్గు పడుతూ ఇంట్లోకి వెళ్ళిందేగాని శ్యామలరావు గురించి యేమీ చెప్పలేదు.

ఇటువంటి వాళ్ళిద్దరూ బజార్లో కలిసి తిరుగుతూ కనిపించారంటే, పైగా తనని చూసి నవ్వుకుంటూ వెళ్ళారంటే బ్రహ్మానందానికి ఆశ్చర్యం కలగటంలో ఆశ్చర్యమేముంది?

ఆరాత్రే శ్యామలరావు నడిగాడు, "మీ యిద్దరికీ ఎట్లా కలిసిందని" బ్రహ్మానందం.

అతను నవ్వుతూ, "నాకోసం వస్తున్న అమ్మాయికీ నాకూ ఏమీ సంబంధంలేదని తెలిసి కూడా నీతో కాంతామతి అన్ని అబద్ధాలు చెప్పిందంటే అర్థం ఏమిటి?" అని అడిగాడు.

"ఏమిటో నువ్వే చెప్పు" అన్నాడు బ్రహ్మానందం.

"జెలసీ....నామీద అభిప్రాయం తనకి ఉన్నదని చెప్పటం"

"ఊఁ-తరవాత?" అని అడిగాడు అతను.

"తరవాత యింకేముంది, నువ్వు చెప్పిన మాటను బట్టి ఆమె మనస్సు గ్రహించి ఏర్పాటు చేశాను" అన్నాడు శ్యామలరావు.

బ్రహ్మానందానికి చాలా కష్టం వేసింది. "అయితే మీ యిద్దర్నీ సంధాన పరచటానికి నేను ఉపయోగించానన్న మాట" అన్నాడు.

శ్యామలరావు చిరునవ్వు నవ్వుతూ, "ఇతరుల కుపయోగపడే నీటోటి మహానుభావులు అప్పుడప్పుడూ పుడుతూ వుంటారు. లేకపోతే భారతదేశం ఎప్పుడో కాలగర్భంలో మునిగిపోయేది" అన్నాడు.

"చాల్లే వూరుకో" అన్నాడు బ్రహ్మానందం.

"కాని, ఏమాట కామాట చెప్పుకోవాలోయ్-కాంతామతి యెంత సరసురాలు అనుకున్నావు" అని పూర్తి చేశాడు శ్యామలరావు ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ.